సాక్షి ఖమ్మం

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



కరెంట్‌తో జర జాగ్రత్త..
ఈదురుగాలులు, అకాల వర్షాల నేపథ్యంలో విద్యుత్ తీగలు, ఉపకరణాలతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో



... పదోన్నతులు, బదిలీలు
వేసవి సెలవుల్లోనే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తిచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 25°

వాతావరణం
జిల్లాలో గురువారం ఉదయం, సాయంత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం మాత్రం ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 3–30గంటలకు తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండాలో మంత్రి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మేడిదపల్లిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు, తెట్టేలపాడు, పిండిప్రోలులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, పీఏసీఎస్ ఆధ్వర్యాన నిర్మించిన గోదాంను ప్రారంభిస్తారు. అనంతరం తిరుమలాయపాలెంలో సీసీ రోడ్లు, పీఏసీఎస్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర

తిరుమలాయపాలెం: వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మాలని, తద్వారా మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. మండలంలోని మేడిదపల్లిలో వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించిన మాట్లాడారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ కోతలు పూర్తిచేయాలని, కల్లాల్లోనూ తడవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓ లంక రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు 28మంది లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు

ఖమ్మంవ్యవసాయం: వెటర్నరీ అసిస్టెంట్ల నుంచి లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన వారిలో 28మందిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా పశువైద్య, పశు సంవర్ధక శాఖలో అర్హత కలిగిన వెటర్నరీ అసిస్టెంట్ల(పశువైద్య సహాయకులు)కు లైవ్‌స్టాక్ అసిసెంట్లు(పశు సంపద సహాయకులు)గా బుధవారం పదోన్నతి కల్పించారు. ఇందుకోసం హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ నిర్వహించగా, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 46మందికి అవకాశం దక్కింది. వీరిలో 28మందిని ఉమ్మడి జిల్లాలోని వివిధ పశువైద్య ఉప కేంద్రాలకు ఖమ్మం జేడీ డాక్టర్ వెంకట నారాయణ పర్యవేక్షణలో కేటాయించారు.

మాకు లేదా ఆ భాగ్యం?



బియ్యం ఖర్చు తగ్గుతుందనుకుంటే..



ఈమె పేరు అనసూరి శ్రీదేవి. చింతకాని మండలం మత్కేపల్లికి చెందిన శ్రీదేవికి 2011లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఉండటానికి ఒక గది ఇల్లు తప్ప ఇతర ఆస్తులు లేవు. 2021లో భర్త చనిపోయినప్పటి నుంచి రేషన్‌కార్డు కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకోవడంతో పాటు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన సభలో మళ్లీ దరఖాస్తు చేసుకుంది. ఇల్లు గడవటమే అంతంత మాత్రంగా ఉన్న తమకు రేషన్‌కార్డు మంజూరు చేయాలని.. తద్వారా బియ్యం వస్తే ఉపశమనంగా ఉంటుందని చెబుతోంది.

సన్నబియ్యం కోసం పేదల ఎదురుచూపులు

- అర్హులకు రేషన్ కార్డుల జారీలో జాప్యం
- 74,244 దరఖాస్తులపై కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన
- ఇది పూర్తయితేనే అర్హుల ప్రకటన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సంక్షేమ పథకాల అమలులో భాగంగా రేషన్‌కార్డులు వస్తాయని భావించిన పేదలు మరికొన్నాళ్లు వేచిచూడక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభిస్తామని ప్రకటించగా.. అందులో రేషన్‌కార్డులు కూడా ఉన్నాయి. అయితే, ఆ సమయాన ఎంపిక చేసిన గ్రామపంచాయతీల్లో 484 మందికే కార్డులు జారీ చేశారు. ఇంకా ప్రజాపాలన, మీ సేవ కేంద్రాల్లో అందిన 74,244 దరఖాస్తులపై విచారణ పూర్తికాక పోవడంతో ఎప్పుడు కార్డులు జారీ చేస్తారు, తామెప్పుడు సన్నబియ్యం తీసుకుంటామోనని పేదలు ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తుల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుచేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. దీంతో అదేనెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించిన సభల్లో అర్హుల జాబితాలు ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించారు. ఈమేరకు 20 గ్రామపంచాయతీల్లో తొలుత 484 మందికి కార్డులు మంజూరు చేయగా.. పాత వారితో కలిపి ఈ కుటుంబాలు మాత్రమే సన్న బియ్యం తీసుకుంటున్నాయి. కాగా, ప్రజాపాలన సభల్లో తెల్లరేషన్ కార్డుల కోసం 66,608 దరఖాస్తులు అందగా.. మీ సేవ కేంద్రాల ద్వారా 7,636 దరఖాస్తులు వచ్చాయి. బియ్యంతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు.

కొనసాగుతున్న సర్వే

ప్రజాపాలన సభల్లో అందిన 66,608 దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించారు. ఇళ్లకు వెళ్లి అర్హులో, కాదో గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు 3,329 దరఖాస్తుల పరిశీలనే పూర్తికాగా, ఇంకా 63,279 దరఖాస్తులు ఉన్నాయి. ఇవన్నీ పరిశీలించడానికి ఎంత సమయం పడుతుందో తెలియడం లేదు. ఇక మీ సేవ కేంద్రాల ద్వారా అందిన 7,636 దరఖాస్తులు అలాగే ఉన్నాయి. వీటన్నింటి సర్వే పూర్తిచేసి అర్హులను గుర్తించి కార్డులు మంజూరు చేయడానికి చాలా సమయం పట్టే అవకాశముందని చెబుతున్నారు.



బియ్యం తీసుకునేందుకు ఓ షాప్ వద్ద బారులుదీరిన లబ్ధిదారులు (ఫైల్)

సన్నబియ్యంతో ఆరాటం

ఈనెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించింది. దీంతో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమకు కార్డు ఎప్పుడు వస్తుందా అని ఆరా తీస్తున్నారు. కొందరు కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తుల స్థితిగతులను తెలుసుకుంటున్నారు. దరఖాస్తుదారుల్లో ఎక్కువగా పేదలే ఉండడంతో కార్డు మంజూరైతే సన్నబియ్యం తీసుకోవచ్చని, తద్వారా కుటుంబ నిర్వహణ ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నారు. కానీ కార్డుల మంజూరుకు ఇంకొంత సమయం పడుతుందనే చర్చ జరుగుతుండడంతో వారు నిరాశకు లోనవుతున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

- భూసేకరణపై దృష్టి సారించండి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం అర్బన్: పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, అటవీ, రెవెన్యూ భూముల సమస్యలపై సమీక్షించారు. పులిగుండాలలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, మహిళా స్వయం సహాయక సంఘాలతో క్యాంటీన్ ఏర్పాటుచేయించాలని తెలిపారు. అలాగే, సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్ అభివృద్ధి, శాఖల మధ్య భూముల అప్పగింతపై చర్చించి సూచనలు చేశారు. ఆతర్వాత జిల్లాలో జాతీయ రహదారులు, మున్నేరు రిటైనింగ్ వాల్, కిష్టారం సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించిన కలెక్టర్ భూసేకరణ, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈసమావేశాల్లో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎస్డీసీ రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, నేషనల్ హైవే పీడీ రామాంజనేయరెడ్డి, సింగరేణి జీఎం శాలేం రాజు, ఎఫ్‌డీఓ మంజుల పాల్గొన్నారు.

■ **ఖమ్మంవైద్యవిభాగం:** మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం ప్రధాన ఆస్పత్రిలో వసతులు, వైద్య కళాశాలలో సౌకర్యాలపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జిల్లావైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఆయన బుధవారం సమీక్షించారు. పెద్దాస్పత్రిలో టాయిలెట్ల మరమ్మతు, కొత్త నిర్మాణాలు, ఇతర అంశాలపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్ఓ కళావతి బాయి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్ కుమార్‌తో పాటు డాక్టర్ సైదులు, షఫీయుల్లా తదితరులు పాల్గొన్నారు.

■ **ఖమ్మం సహకారనగర్:** అనుమానాస్పద మరణాల్లో కారణాలు తెలుసుకోవడానికి ఫోరెన్సిక్ నివేదికలు ఉపయోగపడతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం జూబ్లీపురలోని ప్రాంతీయ న్యాయ వైజ్ఞానిక శాస్త్ర ప్రయోగశాలను ఆయన సందర్శించగా, ల్యాబ్ పనితీరును సైంటిఫిక్ అధికారి డాక్టర్ వి.నాగలక్ష్మి వివరించారు. అనంతరం భవనం వినియోగం, నిర్వహణపై సూచనలు చేయగా, డీపీఆర్వో ఎం.ఎ.గౌస్, ఏపీఆర్వో అయూబ్ ఖాన్, సైంటిఫిక్ అధికారి కె.సుధాకర్, ఏఓ నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్ఓ సిద్ధార్థ్

■ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా భద్రత, సీసీ కెమెరాల నిర్వహణపై సూచనలు చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సీహెచ్. స్వామి, డీటీ అన్సారీ పాల్గొన్నారు.

■ సమాజంలో మెరుగైన మార్పు సివిల్ సర్వీసెస్ ద్వారా సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడగా గ్రూప్–1 విజేతలను సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, అకాడమీ ఫౌండర్ వి.అభిరామ్ పాల్గొన్నారు.

■ **ఖమ్మం మయూరిసెంటర్:** విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపుతో పాటు అస్తిత్వం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని బీఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న అవకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గురుకులాల బాధ్యులు రాజలక్ష్మి, స్వరూపరాణి, ఎన్నారై ఫౌండేషన్ బాధ్యులు రామకృష్ణ, బాబు బాయన్న, కట్టా సాగర్, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భగవంతుడు ఇచ్చే కానుకే ఆడపిల్ల

ఖమ్మంమయూరిసెంటర్: ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు భగవంతుడు ఇచ్చిన ఆత్మీయ కానుకగా భావించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. 'మా పాప – మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చిన ఖమ్మం సారథినగర్‌లోని మౌనిక – సురేష్ దంపతుల ఇంటికి కలెక్టర్ బుధవారం వెళ్లారు. దంపతులతో పాటు వారి తల్లిదండ్రులు, అత్తమామలను సన్మానించాక కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్ల పుడితే భారంగా కాక వరంలా భావించి చదివించాలని సూచించారు. అనంతరం మౌనిక – సురేష్ దంపతుల వినతితో వారి పెద్ద కుమార్తె రితికకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రామ్‌గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, సీడీపీఓ వీరభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



మౌనిక-సురేష్ కుటుంబీకులతో సన్నబియ్యం భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం బుధవారం కిటకిటలాడింది. ఈ కార్యాలయంలోనే మీ-సేవా కేంద్రం ఉండటంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసేందుకు పెద్దసంఖ్యలో జనం వచ్చారు. మరోపక్క రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు సమర్పించే వారు, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించే వారు తోడవడంతో కార్యాలయమంతా జనంతో నిండిపోయింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

65మంది ఉపాధ్యాయులకు మెమోలు

ఎస్సెస్సీ వాల్యుయేషన్‌కు గైర్హాజరే కారణం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలకు విద్యాశాఖ ఉపక్రమించింది. ఈక్రమంలో విధులకు గైర్హాజరైన 65మంది ఉపాధ్యాయులకు బుధవారం మెమోలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సోమవారం నుంచి మూల్యాంకనం మొదలైంది. స్పాట్ వాల్యుయేషన్‌కు 650మంది ఉపాధ్యాయులు అవసరమైతే.. తొలిరోజు సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, హిందీ స్కూల్ అసిస్టెంట్లు 78మంది తక్కువగా వచ్చారు. దీంతో మంగళవారం భద్రాద్రి జిల్లా ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. కానీ మంగళవారం కూడా 620మందే విధులకు హాజరయ్యారు. ఈమేరకు సోషల్ సబ్జెక్ట్ మూల్యాంకనానికి 30మంది ఉపాధ్యాయులు తక్కువ పడడంతో గురుకులాల ఉపాధ్యాయులను తీసుకోవాలని నిర్ణయించారు. ఇక విధులు కేటాయించినా రెండు రోజులు హాజరుకాని వారికి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అనారోగ్యం, ఉద్యోగ విరమణ

అనారోగ్యంతో బాధపడుతున్న వారు, త్వరలో రిటైర్ కానున్న టీచర్లకు సైతం విధులు కేటాయించడమే కాక గైర్హాజరయ్యారని షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఖమ్మంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరైనా మెమో జారీ చేశారని వాపోయాడు. విధులు కేటాయించిన ఉపాధ్యాయులు రాలేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడిని చూపినా విధుల్లోకి తీసుకోకుండా మెమోలు జారీచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై డీఈఓ సోమశేఖర శర్మను వివరణ కోరగా... అనారోగ్యానికి గురైన వారు, రిటైర్‌మెంట్‌కు సమీపంలో ఉన్న వారు వివరాలు సమర్పిస్తే విధుల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

వైభవం.. జలవిహారం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారాముల వారు బుధవారం గోదావరిలో జలవిహారం చేశారు. తొలుత ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా గోదావరి వద్దకు తీసుకొచ్చారు. అలంకరించిన పడవలో స్వామివారిని కొలువుదీర్చి పూజలు చేశారు. ఈఓ రమాదేవి గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించాక స్వామి వారికి జలవిహారం గావించారు. రాత్రికి దొంగల దోపు ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు. ఈ వేడుకలో ఉద్యోగుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



జలవిహారంలో సీతారాములు

అమ్మలేక.. దాయలేక..

- వాతావరణ పరిస్థితులతో తగ్గిన మిర్చి దిగుబడి
- మరోపక్క నానాటికీ పతనమవుతున్న ధర
- నిల్వ చేద్దామంటే అప్పుల బాధతో రైతుల బెంబేలు
- వేచిచూసే ధోరణితో కోల్డ్ స్టోరేజీలకు పరుగులు



కల్లంలో నిల్వ ఉన్న మిర్చి



మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీకి తరలిస్తున్న వాహనాలు

మధిర: ఈ వానాకాలం సీజన్‌లో పండించిన మిర్చి రకరకాల కారణాలతో దిగుబడి పడిపోగా, ధరలు సైతం పతనమవుతుండడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలో 59 వేల ఎకరాల్లో రైతులు మిరప సాగు చేశారు. పైరు సాగు చేసేటప్పుడు తేజ రకం క్వింటా ధర రూ.23 వేల మేర ఉండగా.. పంట చేతికొచ్చేలోగా విదేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ప్రస్తుతం నాణ్యమైన మిర్చి ధర క్వింటాకు రూ.12 వేలు, కాస్త నాణ్యత తక్కువైతే రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకే ధర చెల్లిస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక.. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేద్దామంటే అద్దె చెల్లించడం ఎలాగో తెలియక రైతులు విలవిల్లాడుతున్నారు. కొద్దోగొప్పో స్తోమత ఉన్న రైతులు కోల్డ్‌స్టోరేజీలను ఆశ్రయిస్తుండడంతో అవి కూడా నిండే స్థితికి చేరాయి.

గిట్టుబాటు కాని పంట

గతంలో మిర్చికి మంచి ధర ఉండడంతో ఈ ఏడాది వానాకాలంలో రైతులు సాగుకు మక్కువ కనబరిచారు. కానీ, ప్రస్తుత ధరకు విక్రయిస్తే కనీసం సగం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతుండగా.. కౌలు రైతులు మరింత వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం క్వింటా రూ.10 వేల చొప్పున విక్రయిస్తే 12 క్వింటాళ్లు దిగబడి వచ్చిన రైతుకు రూ.1.20 లక్షలు చేతికొస్తాయి. పెట్టుబడి రూ.2 లక్షల వరకు అయిన నేపథ్యాన ప్రస్తుత ధరతో ఒక్కో రైతు రూ.50 వేల నుంచి రూ.లక్ష మేర నష్టం మూటగట్టుకోవాల్సి ఉండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

ఒక్క కోతతోనే పూర్తి

గతంలో మిరప కోతలు రెండు, మూడు దఫాలుగా చేసేవారు. ఈ ఏడాది ఎర్రనల్లి కారణంగా ఎకరానికి 10 – 15 క్వింటాళ్ల దిగుబడి మించడంలేదు. ఫలితంగా పలువురు రైతులు ఒక్క కోత తర్వాత పైర్లను వదిలేశారు. సాధారణంగా ఏప్రిల్‌లో చివరి వరకు కోత తర్వాత పైరును వదిలేయాల్సి ఉండగా.. ఈసారి మార్చి చివరలోనే ఈ పని పూర్తిచేశారు. దిగుబడి పర్వాలేదనుకున్న రైతులు మాత్రం రెండో కోత ద్వారా వచ్చిన మిర్చిని విక్రయిస్తే వచ్చే రూ.10 వేలలో కూలీలకే రూ.6 వేలు చెల్లించాల్సి వస్తోంది. మిగిలిన రూ.4 వేలలోనే పెట్టుబడి వచ్చే పరిస్థితి కానరాక మక్కువ చూపడం లేదు.

పత్తి సాగు తగ్గిస్తే..

ఈ ఏడాది మిరప సాగు చేసిన రైతులు ఆది నుంచి ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. వానాకాలంలో సాగు చేసిన మిర్చికి మంచి ధర వస్తుందని పత్తి సాగు తగ్గించి మిరపపై మక్కువ కనబరిచారు. కానీ, ఎర్రనల్లితో వారి ఆశలు అడియాసలయ్యాయి. దిగుబడులు తగ్గడమే కాకుండా పంట చేతికి వచ్చే సమయంలో పడిపోయిన ధరతో మరింత నష్టం వచ్చింది. ఇక అరకొరగా పండిన పంటను కల్లాల్లో ఆరబోస్తే తాజా వర్షాలతో తడిసిపోయింది. ఇలా రకరకాల కారణాలతో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

నిండుతున్న కోల్డ్ స్టోరేజీలు

కొందరు రైతులు సాగు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక వచ్చిన ధరకే మిర్చిని కల్లాల్లో విక్రయిస్తున్నారు. మరికొందరు మాత్రం కోల్డ్ స్టోరేజ్‌లకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరతో విక్రయిస్తే తీవ్ర నష్టాలు వస్తాయని, కొద్ది నెలలు నిల్వ చేసి తర్వాత అమ్ముకుందామనే ఆలోచనలో ఉన్నారు. దీంతో జిల్లాలోని 41 కోల్డ్ స్టోరేజీలు నిండే స్థితికి చేరాయి. మధిరలోని 12 కోల్డ్ స్టోరేజీల్లో ఎనిమిది పూర్తిగా నిండాయని నిర్వాహకుల ద్వారా తెలిసింది. కానీ మిర్చి నిల్వ చేసినందుకు చెల్లించే అద్దె కలిపితే పెట్టుబడి మరింత పెరుగుతుందని.. ఆ తర్వాత కూడా ధర పెరగకపోతే పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు.

కల్లంలోనే అమ్ముకున్నా..



సాగు సమయాన మిర్చి క్వింటాకు రూ.23 వేలు ఉండగా, ఇప్పుడు రూ.12 వేలకు పడిపోయింది. తెగుళ్లతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. పెట్టుబడిపై వడ్డీ పెరుగుతుండటంతో తక్కువ ధర అయినా చేసేదేం లేక అమ్మడంతో ఎకరాకు రూ.70 వేల నష్టం వచ్చింది.

–లక్కిరెడ్డి సిద్ధారెడ్డి, రైతు, మధిర

కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా..



ప్రస్తుతం ఉన్న రేటుకు మిర్చి అమ్మితే కనీసం రూ.లక్ష నష్టం వస్తుంది. కొద్దిరోజుల తర్వాత ఎగుమతులు పెరిగితే ధర కూడా బాగుంటుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. ఇదిలాగే ఉంటే వచ్చే ఏడాది మిరప సాగు తగ్గడం ఖాయమనే చెప్పాలి.

–వడకాపురపు వరాహచారి, కౌలు రైతు, మధిర

ముగిసిన ఇంటర్ వాల్యుయేషన్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. గత నెల 10న సంస్కృతం సబ్జెక్టుతో వాల్యుయేషన్ ప్రారంభం కాగా... గత 21నుంచి ఈనెల 9వ తేదీ వరకు మిగతా సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనం, పరిశీలన పూర్తయిందని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 3,05,454జవాబుపత్రాల మూల్యాంకనంలో 1,350మంది విధులు నిర్వర్తించారని తెలిపారు.

280.160 మె.టన్నుల ధాన్యం కొనుగోళ్లు

ఖమ్మం సహకారనగర్: రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 344 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 162 కేంద్రాలకు 280.160మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు రవాణా చేస్తున్నామని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) రీజనల్ కార్యాలయం, ఖమ్మం.

వాహనముల వేలం విక్రయ ప్రకటన

మేము వాహనాల వేలం నిర్వహిస్తున్నాము వాటికి సంబంధించిన వివరములు క్రింద ఇవ్వబడినవి.

బ్రాంచ్ పేరు : బస్ స్టేషన్ కాంప్లెక్స్ బ్రాంచ్, ఖమ్మం. సెల్ : 9652405150

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
1.	[illegible]	[illegible]	TS04UD 3284	MAHINDRA MARAZZO	BS IV (Red Cab)	Rs.3,67,420/-
2.	[illegible]	[illegible]	TS04FE 5817	Renault Triber	RXL Petrol 2021/2 (BS-VI) 7 Seater	Rs.4,48,000/-

[illegible]

తేది : 09-04-2025, స్థలం : ఖమ్మం

క్లుప్తంగా

'ధరల పెంపుతో ప్రజలను లూటీ చేస్తున్న కేంద్రం'

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ధర రూ.50, డీజిల్, పెట్రోల్ ధరలు రూ.2 చొప్పున పెంచడం ప్రజలను లూటీ చేసే చర్యగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ భావిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. ఇప్పటికే జీఎస్టీ పేరుతో ప్రజల జేబులను గుల్ల చేస్తుండగా, ధరల పెంపుతో సామాన్యులు ఇబ్బందులు పడతారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ తీరుతో నిరుద్యోగులు, కార్మికులు, మధ్య తరగతి, రైతులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ధరలు తగ్గించాలనే డిమాండ్‌తో గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేయనున్నట్లు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సహచరుల చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న బ్యాచ్‌మేట్లు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ బండి కృష్ణ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రెబ్బవరంలో బుధవారం ఆయన దశ దినకర్మ నిర్వహించగా, కానిస్టేబుల్ బ్యాచ్ సహచరులు కృష్ణ కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. కానిస్టేబుళ్లు మాతంగి విజయ్, భూక్యా బాల్య, గోపాల్, శ్రీకాంత్, నర్సింహారావు, బాలాజీ, రామారావు, సురేశ్, బాగి రమేశ్, ఆంజనేయులు, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీని తనిఖీ చేసిన డైరెక్టర్


సీహెచ్‌పీలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లిలోని జేవీఆర్ సీహెచ్‌పీని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, రవాణాపై అధికారులతో సమీక్షించిన ఆయన కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద దుమ్ము, ధూళి లేవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆ తర్వాత ప్రైమరీ కోల్ క్రషర్ ఏరియా, సైలో బంకర్‌ను కూడా ఆయన పరిశీలించారు. జీఎం టి.సూర్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు తిరుమల్‌రావు, కే.వీ.రావు, జీ.వీ.కోటిరెడ్డి, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్లకు ఐబీబీఎఫ్ అధ్యక్షుడి నజరానా



బహుమతులు ప్రకటిస్తున్న స్వామి రమేశ్‌కుమార్

ఖమ్మంస్పోర్ట్స్: ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ (ఐబీబీఎఫ్) అధ్యక్షుడు స్వామి రమేశ్ కుమార్ అంతర్జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించే క్రీడాకారులు నజరానా ప్రకటించారు. ఈ మేరకు క్రీడాకారులకు సొంత నిధులతో నగదు బహుమతులు అందిస్తానని తెలిపారు. జూన్ 11 నుంచి భూటాన్‌లో జరగనున్న సౌత్ ఆసియాడ్ పోటీల్లో మిస్టర్ సౌత్ ఆసియాడ్‌గా ఎంపికయ్యే భారత క్రీడాకారుడికి రూ.లక్ష, ఆగస్టులో బ్యాంకాక్‌లో జరగనున్న మిస్టర్ ఆసియాడ్ పోటీల్లో పతకం సాధించే భారత క్రీడాకారుడికి రూ.3 లక్షలు, ఇండోనేషియాలో జరిగే ప్రపంచ మిస్టర్ వరల్డ్‌గా గుర్తింపు సాధించే క్రీడాకారుడికి రూ.6 లక్షలు నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా ఐబీబీఎఫ్ అధ్యక్షుడిగా సొంత నిధులతో ఈ నజరానా ఇవ్వనున్నట్లు స్వామి రమేశ్‌కుమార్ వెల్లడించారు.

యామీ.. ఇక లేదు

ఖమ్మంక్రైం: వివిధ నేరాల సమయాన ఆధారాల సేకరణలో తొమ్మిదేళ్ల పాటు పోలీసులకు సహకరించిన జాగిలం యామీ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. లాబ్రడార్ రిట్రీవర్ సంతతికి చెందిన యామీ మృతి చెందడంతో ఏసీపీలు సుశీల్‌సింగ్, నర్సయ్య, హ్యాండ్లర్ సురేశ్ పుష్పగుచ్ఛాలు వేసి యామీకి నివాళులర్పించారు. 2016లో ఎనిమిది నెలల శిక్షణ అనంతరం ఇది జిల్లా పోలీసు శాఖలో చేరిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

కరెంటుతో జర జాగ్రత్త..

- అవగాహన లేమితో ప్రమాదాలు
- ఈదురుగాలుల వేళ అప్రమత్తంగా ఉండకపోతే ముప్పే
- ప్రజలకు సూచనలు జారీ చేసిన విద్యుత్ శాఖ




ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలకు విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. ఆ మార్గంలో వెళ్లి మానవులు, పశువుల మరణాలు సంభవిస్తుంటాయి. అక్రమంగా అటవీ ప్రాంతాల్లో జంతువుల కోసం అమర్చే విద్యుత్ వలల్లో కూడా పడి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. జలాశయాల్లో చేపల వేటకు విద్యుత్ వినియోగించి మత్స్యకారులు ప్రమాదాలబారిన పడుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. విద్యుత్ గృహోపకరణాల వినియోగంలో అజాగ్రత్తగా ఉండటం.. వ్యవసాయ మోటార్లు, పరిశ్రమల వద్ద విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నందున తీసుకోవాల్సిన రక్షణ, జాగ్రత్తలపై ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పలు సూచనలు జారీ చేశారు.

- వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు / సపోర్టు వైరు, స్తంభాలు, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- బట్టలు ఆరవేసే జీఐ దండెం వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడంతో దండేలకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంది. కాబట్టి ప్లాస్టిక్ దండేలను మాత్రమే ఉపయోగించాలి.
- ఇళ్ల రేకులకు కూడా విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ సరఫరా వైర్లను దండేలు, రేకులకు తగలకుండా చూసుకోవాలి.
- రైతులు కరెంట్ మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వ్‌లను ఏమరపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లకు స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి.
- రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ సంబంధిత పనులు చేసుకోకూడదు.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయించాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్లను ఉపయోగించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడొద్దు. చార్జింగ్ తొలగించి ఫోన్‌ను వాడాలి.
- ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే ఆ వ్యక్తిని ముట్టుకోవద్దు. కర్ర, ప్లాస్టిక్ లాంటి వస్తువులతో వైరును వేరు చేయాలి.
- నాణ్యమైన విద్యుత్ పరికరాలు (ఐఎస్ఐ మార్క్ గలవి) వినియోగించాలి.
- విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

పదోన్నతుల సమస్య పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: పదోన్నతుల సమస్యలను అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, టీహెచ్‌డబ్ల్యూవోస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గౌస్ హష్మీ తెలిపారు. తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారులు ఫోరం జిల్లా సమావేశం ఖమ్మం టీఎన్జీవోస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు, హష్మీ మాట్లాడుతూ.. సబార్డినేట్ సర్వీస్ రూల్స్–16 హెచ్ ప్రకారం పదోన్నతులు ఇచ్చే క్రమంలో ఎదురయ్యే సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఆ తర్వాత పలువురి అభిప్రాయాల మేరకు గ్రేడ్–1 కేడర్ స్రైంత్ ఏర్పాటు, సంక్షేమ అధికారులకు తెలంగాణ సబార్డినేట్ సర్వీస్ రూల్స్–16 హెచ్ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని తీర్మానించారు. ఫోరం జిల్లా కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావుతో పాటు వివిధ జిల్లాల బాధ్యులు కె.తిరుపతిరావు, కె.కృష్ణ, టి.రాంబాబు, నెల్లూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

పెనుబల్లి: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయడమే కాక పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్ జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువగా ఉన్నాయని సీఎం వ్యాఖ్యానించడం గర్హనీయమన్నారు. ఇతర ఉద్యోగులకు ఏటా 30 సంపాదిత సెలవులు ఇస్తారని, ఉపాధ్యాయులను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ప్రకటించినందున ఆరు రోజులే ఇస్తూ తప్పుడు ప్రకటన చేయడం సరికాదన్నారు. ఈ మేరకు రెండో పీఆర్సీ అమలు చేయడమే కాక పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడమే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ఉపాధ్యాయులు పాల్గొనాలని రవి పిలుపునిచ్చారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పి.నాగేశ్వరరావుతో పాటు నాగమల్లేశ్వరరావు, వీవీ రామారావు, జి.వీరస్వామి, కొప్పుల శ్రీనివాసరావు, ఎస్‌హెచ్.ప్రసాద్, వి.తిరుపతిరావు, కె.నాగేశ్వరరావు, పి.మురళీకృష్ణ, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్లలో దొంగల బీభత్సం

సుమారు రూ.80 లక్షలకుపైగా సొత్తు అపహరణ


బీరువాను పరిశీలిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్లలోకి ముగ్గురు దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. మూడు బ్లాక్‌ల్లోని ఎనిమిది క్వార్టర్లలో సుమారు రూ.80 లక్షలకు పైగా సొత్తు అపహరణకు పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సత్తుపల్లిలోని పీవీ నర్సింహారావు సింగరేణి క్వార్టర్లలోని తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకున్న దుండగులు చోరీ చేశారు. క్వార్టర్ల వెనకాల అటవీ మార్గం వైపు నుంచి వస్తూ ప్రహరీపై ఫెన్సింగ్ తొలగించి లోపలికి చొరబడ్డారు. ఆపై ముఖాలకు మాస్క్ పెట్టుకున్న ముగ్గురు తాళాలు పగలగొట్టి సొత్తు అపహరించారు. జి.రాజశేఖర్ ఇంట్లో 400 గ్రాముల బంగారం, 10 గ్రాముల వెండి, షణ్ముక్ క్వార్టర్‌లో రూ.లక్ష నగదు, 60 గ్రాముల బంగారం, సుందర్ ఇంట్లో 100 గ్రాముల బంగారం, పొట్టి కిరణ్ ఇంట్లో 60 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, విజయ్‌కుమార్ ఇంట్లో 20 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండితో పాటు రామస్వామి ఇంట్లో విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. మరికొన్ని క్వార్టర్ల తాళాలు పగులగొట్టినా ఏమీ దొరక్కపోవడంతో వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి బుధవారం తెల్లవారుజామున 2.50 గంటల వరకు దుండుగులు ఈ ఘటనకు పాల్పడినట్లు సీసీ కెమెరాల ఫుటేజీల్లో నమోదైంది. దీంతో బుధవారం ఏసీపీ ఎ.రఘు, వీ.ఎం.బంజర్ సీఐ ముత్తిలింగం, ఎస్ఐ రఘు పరిశీలించగా, ఖమ్మం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలతో విచారణ చేపట్టారు.


ఆధారాల సేకరణలో డాగ్‌స్క్వాడ్ బృందం

బంధువే మోసం చేశాడు..

న్యాయం చేయాలని వృద్ధ దంపతుల విన్నపం


నాగేంద్రమ్మ – భిక్షాలు

వైరా: సమీప బంధువు నమ్మించి డబ్బు తీసుకున్నాడంటూ వృద్ధ దంపతులు ఏడాదిగా కలెక్టరేట్, పోలీస్ స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. వైరాలోని బ్రాహ్మణపల్లికి చెందిన తేళ్లూరి నాగేంద్రమ్మ – భిక్షాలు దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు అనారోగ్యంతో మృతి చెందగా కూతుళ్ల వివాహమైంది. నాగేంద్రమ్మ రోడ్డు వెంట పల్లీలు అమ్ముతుండగా, రెండేళ్ల కిందట వారి ఇంటిని అమ్మగా వచ్చిన రూ.4.10 లక్షలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఏడాది పాటు సక్రమంగానే వడ్డీ రాగా ఆ తర్వాత నిలిచిపోయింది. అయితే, తన బంధువు పినపాటి వినోద్ ఏపీలోని గంపలగూడెం మండలం ఉమ్మడి దేవరపల్లిలో నివాసం ఉంటూ గతేడాది తనకు బ్యాంకులో తెలిసిన వారున్నారని తీసుకెళ్లాడని నాగేంద్రమ్మ చెబుతోంది. తనతో సంతకాలు చేయించి ఖాతా నుంచి రూ4.10 లక్షలు తీసుకున్నాడని, ఈ విషయం తెలియక వడ్డీ కోసం బ్యాంకుకు వెళ్తే అధికారులు చెప్పారని వాపోయింది. గత ఏడాది అక్టోబర్ 16న వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు కలెక్టరేట్‌లోని ప్రజావాణి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేశానని, పెద్దమనుషుల సమక్షాన డబ్బు తిరిగి ఇస్తానని వినోద్ ఒప్పుకున్నాడని, అతడి నుంచి డబ్బులు ఇప్పించాలని నాగేంద్రమ్మ కోరుతోంది.

శ్రీకాంత్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

సంతాప సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అరుణ్


శ్రీకాంత్ అంతిమయాత్రలో పాల్గొన్న వివిధ పార్టీల శ్రేణులు


అంతిమయాత్రలో ఎంపీ రవిచంద్ర, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ ఔన్నత్యాన్ని చాటుతూ ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మధురైలో జరిగిన సీపీఎం అఖిల భారత మహాసభలకు వెళ్లిన శ్రీకాంత్ గుండెపోటుతో మృతి చెందగా ఆయన అంత్యక్రియలు బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ నివాసంలో జరిగిన సంతాపసభలో అరుణ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో విద్యార్థి ఉద్యమాభివృద్ధికి ఆయన తోడ్పడ్డారని గుర్తుచేశారు. ఆయన కుటుంబం పార్టీ కోసం నిలబడినందున, ఇప్పుడు వారికి పార్టీ చేదోడుగా నిలవాలని సూచించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. శ్రీకాంత్ లాంటి పోరాట యోధుడు దూరం కావడం బాధాకరమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు పనిచేసిన శ్రీకాంత్ సేవలు మరువలేనివని చెప్పారు. అనంతరం అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరుకాగా, ఆయన పాడెను అరుణ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు మోశారు. ఇంకా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎం.సాయిబాబు, బి.వెంకట్, వై.వెంకటేశ్వరరావు, జూలకంటి రంగారెడ్డి, బాగం హేమంతరావు, పోలడుగు భాస్కర్, బండారు రవికుమార్, ప్రభాకర్, చావా రవి, ఆలుగుబెల్లి నర్సిరెడ్డి, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే, దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ జిల్లా కమిటీ బాధ్యులు షేక్ అబ్దుల్ రెహమాన్, మావిడాల ఝాన్సీ, దామల్ల జయ తదితరులు కూడా శ్రీకాంత్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాల్సిందే..


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో రైతు సంఘం నాయకులు

రైతు ధర్నాలో బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు రైతులకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని, లేనిపక్షంలో రైతాంగం ఆగ్రహానికి గురికాక తప్పదని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు హెచ్చరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా పథకం అమలు చేయాలనే డిమాండ్‌తో బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో తాత్సారం చేయడం సరికాదన్నారు. రుణమాఫీ రూ.31 వేల కోట్లలో రూ.20 వేల కోట్లే మాఫీ చేయడం, రైతు భరోసాకు రెండు సీజన్లలో కలిపి రూ.15 వేలు ఇస్తామని, సీజన్‌కు రూ.6 వేలే ఇవ్వడం గర్హనీయమని తెలిపారు. అది కూడా అందరికీ అందలేదని పేర్కొన్నారు. ఇకనైనా హామీలన్నీ సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ, రైతు సంఘం నాయకులు దండి సురేశ్, మిడికంటి వెంకటరెడ్డి, కూచిపుడి రవి, ఏపూరి రవీంద్రబాబు, జక్కుల రామారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, బానోత్ రామ్‌కోటి తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలతో ప్రపంచానికి సవాళ్లు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అరుణ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కోబోతోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన 'ట్రంప్ విధానాలు – భారతదేశంపై ప్రభావం' అంశంపై బుధవారం నిర్వహించిన సెమినార్‌కు కేవీ.నవీన్, లక్ష్మీనారాయణ, ఎం.సుబ్బారావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ మోడీ – ట్రంప్ – నేతన్యాహు త్రిమూర్తుల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారతీయ విద్యార్థుల విషయంలో అమెరికా వ్యవహరిస్తున్న తీరును అందరూ గుర్తించాలని కోరారు. భారత్‌పై విధించే సుంకాలపై మోడీ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని జానకీపురానికి చెందిన షేక్ నాగూర్‌బాషా (31) మోటమర్రి రైల్వేస్టేషన్ సమీపాన బుధవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత సమస్యల కారణంగానే ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మధిర జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి పంచనామా నిర్వహించి ఆర్‌కే ఫౌండేషన్ బాధ్యులు డాక్టర్ దోర్నాల రామకృష్ణ, మునుగోటి రామకృష్ణ సాయంతో మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

280 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

వేంసూరు: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట నుంచి ఛతీస్‌గఢ్‌కు లారీలో అక్రమంగా తరలిస్తున్న 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వేంసూరు పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. వేంసూరులోని అంబేడ్కర్‌నగర్ వద్ద లారీ పట్టుబడగా సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించారు. దీంతో బియ్యాన్ని పరిశీలన కోసం పంపించగా, కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయీస్ అధికారులు బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


తూము కోటయ్య (ఫైల్)

కల్లూరురూరల్: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం పెద్దవరానికి చెందిన తూము కోటయ్య (74) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మంగళవారం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై కల్లూరు మండలం చెన్నూరుకు వస్తుండగా రావికంపాడు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరగగా తీవ్రంగా గాయపడిన కోటయ్యను ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతో ట్రాక్టర్ డ్రైవర్ వల్లమూడి వేణుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.41.50 లక్షల విలువైన గంజాయి దహనం

తల్లాడ: జిల్లాలోని ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న 83 కిలోల గంజాయిని బుధవారం దహనం చేశారు. తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడబ్ల్యూఎం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నిపుణుల పర్యవేక్షణలో గంజాయిని కాల్చివేశారు. ఖమ్మం, ఖమ్మం–2, సత్తుపల్లి, మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 32 సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న ఈ గంజాయి విలువ రూ.41.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. డిస్పోజబుల్ అధికారి, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించగా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ఏన్కూరు: మండలంలోని రాయమాదారం ఎన్నెస్పీ కాల్వలో గుర్తు తెలియని మహిళ (40) మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి గుగులోతు ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహంపై చర్మం ఊడిపోయి కుళ్లిపోగా, శరీరంపై లంగా, పింక్ కలర్ జాకెట్ ఉన్న ఆమె ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

చింతకాని: మండలంలోని పాతర్లపాడులో రైతు కొత్తపల్లి వెంకటికి చెందిన మొక్కజొన్న పంట బుధవారం అగ్నికి ఆహుతైంది. ఆయన మూడెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. సగం మేర కంకి విరిచి పొలంలోనే కుప్పగా పోయగా, గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. ఆ మంటలు గాలికి వ్యాపించి పంటకు అంటుకోవడంతో కంకులన్నీ కాలిపోయాయి.

అదుపుతప్పిన డీఎంహెచ్ఓ వాహనం

డ్రైవర్ మద్యం మత్తులో నడపడంతో ప్రమాదం

ఖమ్మంక్రైం: డీఎంహెచ్ఓ వాహనం అదుపు తప్పింది. బుధవారం రాత్రి వాహనం డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతో ఒక వృద్ధుడికి తీవ్ర గాయాలు కాగా, పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. డీఎంహెచ్ఓ వాహనం డ్రైవర్ నాగరాజు జిల్లా ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వైపు బయలుదేరాడు. ఆ సమయంలో వాహనంలో డీఎంహెచ్ఓ లేకపోగా, మద్యం మత్తులో ఉన్న నాగరాజు అతి వేగంగా నడిపే క్రమాన ఇందిరానగర్ వద్ద అదుపు తప్పాడు. పలు వాహనాలను ఢీకొడుతూ పెద్దస్వామిని సైతం ఢీకొట్టగా తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

బావపై బావమరుదుల దాడి

కారేపల్లి: అత్త గారికి ఇచ్చిన అప్పు చెల్లించాలని పెద్దమనుషులతో అడిగించినందుకు బావపై బావమరుదులు దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు కారేపల్లి పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న భూక్యా మల్సూర్ కారేపల్లి మండలం పైల్‌తండాకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. మల్సూర్ ఉద్యోగరీత్యా శిక్షణకు వెళ్తూ భార్యాపిల్లలను అత్తగారి ఇల్లయిన పైల్‌తండాలో వదిలాడు. అయితే, తాను అత్త గారింట్లో అవసరాలకు రూ.లక్ష అప్పు ఇవ్వగా, రూ.80 వేలే ఇచ్చారని మిగతా నగదు అడిగినందున గొడవకు దిగారని పేర్కొన్నారు. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షాన మంగళవారం పంచాయితీ నిర్వహించగా మాటమాట పెరగటంతో మల్సూర్‌పై ఆయన బావమరుదులైన అజ్మీరా రాజేశ్, అజ్మీరా సతీశ్‌తో పాటు అజ్మీరా సంధ్య, అజ్మీరా లక్ష్మి దాడి చేశారు. దీంతో ఆయన ఫిర్యాదుతో బుధవారం పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు.

కల్లులో విషం కలిపారని ఫిర్యాదు

తిరుమలాయపాలెం: కల్లులో విషం కలిపి తన ప్రాణాలు తీసే యత్నం చేశారంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి కృష్ణయ్య తన పొలంలోని తాటిచెట్టు నుంచి స్థానికుడైన వ్యక్తితో కల్లు గీయించాడు. ఈ ఏడాది సోలీపురం మంగ్యాతండాకు చెందిన వ్యక్తికి అప్పగించగా, గుర్తుతెలియని వ్యక్తులు విషం కలిపినట్లు గుర్తించారు. తనపై పగతోనే విషప్రయోగానికి యత్నించారని కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం, తల్లంపాడులో రాబోయే ఐటి హబ్, త్రిస్టార్ హోటల్, స్కూల్, ఖమ్మం టు HYD హైవే ఫేసింగ్ వెంచర్‌లో DTCP ప్లాట్స్ అమ్మబడును. కాట్రపల్లి నాగరాజ్ 93993 42239 [SCA- 25002670]

Services

సంగీతం నేర్పబడును

■ నవ్య స్వర సంగీత కళా నిలయం మమతా రోడ్, ఖమ్మం ఆర్. సుబ్రహ్మణ్య శర్మ శాస్త్రీయ సంగీతం నేర్పబడును. గాత్రం, వైలెన్, కీబోర్డ్ 91600 30999 [SCA 25002667]

Wanted

■ నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలము 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి 3 వేలు-30 వేలు సంపాదించండి. Ph: 9948208005 [HA-1905]

■ తన్మయీఓల్డేజ్‌హోమ్, YSRసర్కిల్‌వద్ద VJA పెద్దవారికి సేవచేయుటకు ఆడ, మగ వర్కర్లు, వంట మనుషులు కావలెను. వ: 20-50 సం॥. 9652423559/7093911010/9573000987 [HA-29]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే

(GST 5% అదనం)